వర్షం బీభత్సం.. జనజీవనం అస్తవ్యస్తం..

• స్తంభించిన రాకపోకలు • చెరువులను తలపించిన బస్తీలు • లక్షల్లో నష్టం వాటిల్లిందన్న వ్యాపారులు


గాయత్రినగర్‌లో చేరిన వరదనీరు

అమీర్‌పేట: అమీర్‌పేట, మైత్రివనం ముంపు ప్రాంతాలు మరోసారి వరదనీటిలో మునిగిపోయాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గాయత్రినగర్, గంగుబాయి, బౌద్ధనగర్ బస్తీలో జలమయమయ్యాయి. స్థానిక ప్రజలు, వ్యాపారులు నిద్రలేని రాత్రి గడిపారు. ఇళ్లు, షాపుల్లోకి నీరు చేరడంతో తీవ్రనష్టం వాటిల్లింది. విలువైన గృహోపకరణాలు, జిరాక్స్ మిషన్లు తడిసిపోయి లక్షల్లో నష్టపోయామని వ్యాపారులు వాపోయారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారుల నిర్లక్ష్యం వల్లే గాయత్రినగర్‌లో గతంలో ఎన్నడు లేని విధంగా వరదనీరు వచ్చిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మైత్రివనం, స్వర్ణ జయంతి కాంప్లెక్స్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై వరదనీరు నిలుస్తుండటంతో వరదనీరు సాఫీగా కిందకు వెళ్లేందుకు హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. వరదనీటి ప్రవాహానికి పెద్ద ఎత్తున వ్యర్థాలు, బురద కొట్టుకు వచ్చి కాలనీ అస్తవ్యస్తంగా మారిందన్నారు.

అమీర్‌పేట: కుండపోతగా కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. వర్షం కారణంగా అమీర్‌పేట డివిజన్‌లోని ఎస్‌ఆర్‌నగర్ రోడ్లన్నీ జలమయం కాగా కొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఎస్‌ఆర్‌నగర్ నారాయణ కళాశాల వద్ద భారీ వృక్షం విరిగి కళాశాల భవనంపై పడి పోయింది.

గాయత్రినగర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

◆ హైడ్రా కమిషనర్ రంగనాథ్ గురువారం ఉదయం గాయత్రినగర్‌లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. వరదనీటి కాల్వ నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు తరళించి చాలా రోజులు అవుతున్నా తిరిగి నిర్మాణ పనులు చేపట్టలేదని కాలనీ వాసులు తెలిపారు. నాలా పనులు పూర్తి చేయకుండానే పై నుంచి వచ్చే వరదనీటి లైన్‌ను కాలనీలోని లైన్‌కు కలపడంతో ఎన్నడు లేని విధంగా వరదనీరు ఇళ్లలోకి వచ్చిందని వాపోయారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాలతో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అధికారుల తీరుపై స్థానిక వ్యాపారులతో కలిసి కాలనీవాసులు ధర్నా చేశారు.

◆ **లాలాపేట:** తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో బుధవారం రాత్రి, గురువారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్ బస్తీలపై భారీగా వరద నీరు చేరి చెరువులను తలపించాయి. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్ నెలకొంది. ప్రజల రాకపోకలకు, జనజీవనానికి తీవ్ర ఇబ్బంది కలిగింది. లాలాపేటలోని ఓపెన్ నాలా ఉధృతంగా ప్రవహిస్తుంది.


రెజిమెంటల్‌బజార్‌లో వరద నీరు

ఇళ్లలోకి చేరిన వరదనీరు

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూ అశోక్‌నగర్, పార్శీగుట్ట, ఎల్‌ఎస్. నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం రాత్రి ఏకదాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు బస్తీల్లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో నివాసితులు అనేక అవస్థలకు గురయ్యారు. రాత్రంగా నిద్ర లేకుండా జాగారం చేశామని పలువురు బస్తీవాసులు వాపోతున్నారు. మహ్మద్ గూడ నాలా పరిసర ప్రాంతాలు కూడా పూర్తిగా వరద నీటితో మునిగిపోయాయి. మోకాలిలోతు నీరు రావడంతో వాహదారులు, పాదచారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఎదురైంది.

మునిగిన పంప్‌హౌజ్

రాంగోపాల్‌పేట్: బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బాలంరాయిలోని ప్రధాన పంప్‌హౌజ్ నీటిలో మునిగిపోయింది. ఈ పంప్‌హౌజ్ నీటిలో మునిగిపోవడంతో మోటర్లు పనిచేయకుండా అయిపోయాయి. వరద నీరు పంప్ హౌజ్‌ను ముంచెత్తడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


చెరువును తలపిస్తున్న లాలాపేట

జలమయమైన ప్రాంతాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లోని నాలా పరీవాహక, లోతట్టు ప్రాంతాలు బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షాలకు జలమయమయ్యాయి. భవానీనగర్, అన్నానగర్, కిందిబస్తీ, ప్రైడే మార్కెట్, షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ తదితర ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లలోకి చేరాయి. మూతపడిన సురేశ్ థియేటర్ ప్రహరీ పక్కనే పార్కింగ్ చేసిన ఆటోపై పడడంతో ఆటో ధ్వంసమైంది. నీటి మునిగిన ప్రాంతాల్లో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు కరాటే రాజు గురువారం పర్యటించారు.


ప్రైడేమార్కెట్ వద్ద నీటమునిగిన వాహనాలు



బౌద్ధనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో వరదనీటిలో కొట్టుకొచ్చిన చెత్తాచెదారం


రాంగోపాల్‌పేట్: చుట్టలబస్తీలో వరద నీరు


నీట మునిగిన మోటర్లు


అమీర్‌పేట: కళాశాల భవనంపై విరిగి పడ్డ చెట్టును తొలగిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

లాలాపేట: సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ 2వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో పాల్గొన్న మాదిగలకు మెగా సన్మానానికి ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అజయ్ తెలిపారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మెగా సన్మాన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అజయ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతను కల్పించిన త్యాగశీలురైన మాదిగ నేతలను అక్టోబర్ 9న సన్మానించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేతలు సందీప్, శ్రీకాంత్, క్రాంతి, శ్రీశైలం, సతీష్, అంజి, చంద్ర అనీల్, గోపి, గోపాల్, మహేశ్, తేజ తదితరులు ఉన్నారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ వివరాల పోస్టర్ ఆవిష్కరణ

అడ్మిషన్ల గడువు 26కు పొడిగింపు

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువును ఈ నెల 26 వరకు పొడిగించినట్లు బేగంపేట రీజనల్ సెంటర్ కో–ఆర్డినేటర్ డా. రామాచారి తెలిపారు. అడ్మిషన్ల వివరాలతో కూడిన పోస్టర్‌ను గురువారం బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని స్టడీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ పద్మావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాచారి మాట్లాడుతూ.. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణత అయిన వారు డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) ఉత్తీర్ణత సాధించిన వారు పీజీలో (ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ లిటరేచర్) అడ్మిషన్ పొందవచ్చన్నారు. డిగ్రీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు సెప్టెంబర్ 26 తుది గడువుగా పేర్కొన్నారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణ అధికారి డా. శ్రీనివాస్ తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ



లాలాపేట: చేయూత ఫౌండేషన్ పదేళ్ల 100వ సేవా కార్యక్రమాల పేరుతో గురువారం లాలాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెద్ద బాలశిక్ష, స్టేషనరీ వస్తువుల కిట్‌ను, వాటర్ బాటిల్‌ను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చేయూత ఫౌండేషన్ ప్రెసిడెంట్ డా. కేతరాజు పూర్ణిమ కామేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేయూత సెక్రటరీ కేతరాజు వరలక్ష్మి, స్కూల్ హెచ్‌ఎం రమణమ్మ, జీఎస్ రావు, అరుణ, ప్రొఫెసర్. టి.విశాలాక్షి, తాటిపాముల, మోహన్ గాంధీ, లెక్చరర్ పద్మావతి, ఆంజనేయ ప్రసాద్ తదితరులున్నారు.

21 నుంచి జెక్‌కాలనీలో బతుకమ్మ సంబరాలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సహకారంతో జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 29 వరకు బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్.అన్నపూర్ణ తెలిపారు. జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. .అధ్యక్షురాలిగా ప్రభా అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అన్నపూర్ణ, ఉపాధ్యక్షులుగా కేవీ రమణమ్మ, విజయలక్ష్మి, పర్వతవర్ధిని, భాగ్యలత, అమరావతి, మల్లు అలివేలు మంగ, సృజన, శ్రీదేవి, స్వప్న, జ్యోతి, సుధ, సత్యకళ, రాధిక, హైమావతి, కృష్ణకుమారి, స్వరూప, హరిత, సంధ్య, రాజ్యలక్ష్మి, విజయ, బేబి, శారద, శైలజ, మహాలక్ష్మి, జీవనజ్యోతి, జాయింట్ సెక్రటరీలుగా వాణి, మాధవి, మమత, అరుణ, షర్మిల, మల్లిక, పార్వతి, సుమలత, కీర్తి, శిరీష, శారద, పద్మలత, కవిత, కవిత, లక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా బాలమణి, లావణ్య, సత్యలక్ష్మి, రాజకుమారి, వసుంధర, సరళ, పద్మజ, సునీత, గీతాంజలి నియమితులయ్యారు.

ఆత్మవిశ్వాసంతో ఎదగాలి


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పద్మారావునగర్: బాలికలు విద్యలో, శారీరకంగా, మానసికంగా ఎదగాలని వైద్యులు సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో గురువారం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు బాలికలకు బీఎంఐ ఇతరత్రా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.రాజ్‌కుమార్ మాట్లాడుతూ నారీ శక్తి అంటే కేవలం కుటుంబానికే కాకుండా సమాజానికి శక్తి అని, యువతులు తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మంచి అలవాట్లను కలిగి ఉండాలన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని సూచించారు. విద్యాభివృద్ధి ద్వారానే బాలికల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హమాల్‌బస్తీ మురికివాడ బాలికలు, అంగన్‌వాడీ టీచర్ కుల్సుం, నర్సు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


సాయినగర్‌లో వీధులను శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని బీజేపీ మహంకాళి జిల్లా ఇన్‌చార్జి నాగభూషణంరెడ్డి అన్నారు. సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో సాయినగర్‌లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. అనంతరం, జిల్లా ఇన్‌చార్జి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశానుసారం మహంకాళి జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయితే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. ప్రజలకు స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్, బిజేపీ నేతలు సంపత్, సాయన్న, కృష్ణ, కన్నాభిరామ్, వీరేశం, హంసరాజు, కళావతి, రాజశేఖర్, జ్ఞానేశ్వర్, సాయి, విజయ్, దిలీప్, కుమార్, శ్యామ్, గంగారాం, రాజేశ్, మహేశ్, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టుగూడలో కాంగ్రెస్ బృందం పర్యటన

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్‌లో భారీవర్షానికి ముంపుకు గురైన ప్రాంతాల్లో గురువారం కాంగ్రెస్ నాయకుల బృందం పర్యటించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ నేతృత్వంలో పర్యటించిన కాంగ్రెస్ నాయకులు మెట్టుగూడ ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అవసరమైన చర్యల కోసం ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతామని సంతోష్‌కుమార్ బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పహాడీ హనుమాన్ ఆలయం అభివృద్ధి కాంగ్రెస్‌దే

అడ్డగుట్ట: పహాడీ హనుమాన్ దేవాలయం అభివృద్ధి ఘనత కాంగ్రెస్ పార్టీదేనని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ ప్రతినిధులు అన్నారు. గురువారం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ అప్పటి ఎమ్మెల్యే జయసుధ, ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ హయాంలోనే అభివృద్ధికి పునాది వేసినట్లు గుర్తుచేశారు. పదేళ్లలో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకునే వారికి ఆలయం పైకప్పు నుంచి వర్షం పడినప్పుడు నీళ్లు కురుస్తుంటే, ఆలయ ప్రాంగణమంతా బురదమయమై భక్తులు జారిపడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. పదేళ్ల అభివృద్ధి చేసినప్పుడు ఆలయం స్లాబ్ లీకేజీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిటీలే వేయలేదని, భక్తుల సౌకర్యం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం దేవాలయం అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

కుటుంబం బాగుండాలంటే.. మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

ఫ్యామిలీ ప్లానింగ్ అడిషనల్ కమిషనర్ ఇందుగ్రేవాల్


సూచనలు ఇస్తున్న అడిషనల్ కమిషనర్ ఇందుగ్రేవాల్, గాంధీ సూపరింటెండెంట్ వాణి

గాంధీఆస్పత్రి: ఆరోగ్యవంతమైన మహిళలు, పిల్లలే సమాజానికి వెలుగని ఫ్యామిలీ ప్లానింగ్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఇందుగ్రేవాల్ అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'స్వస్థ నారీ.. సశక్త్ పరివార్' అభియాన్‌లో భాగంగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణీతో కలిసి మెగా పిడియాట్రిక్ హెల్త్‌క్యాంపును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, కుటుంబం బలంగా ఉండాలంటే మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం చిన్నారులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పోషకాహారం, వ్యాధినివారణ, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, టీకాలు, ఆరోగ్యసూచనలపై అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా పిడియాట్రిక్ హెల్త్‌క్యాంపులో సుమారు 200 మంది చిన్నారులకు వైద్యసేవలు, చికిత్సలు, మందులు అందించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, పిడియాట్రిక్ హెచ్‌ఓడీ వాసుదేవ్, అజయ్‌మోహన్, ఆర్‌ఎంఓ–1 శేషాద్రి, ఆర్‌ఎంఓలు రజనీ, కల్యాణచక్రవర్తి, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

23 నుంచి ఓయూలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన


ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఓయూ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23 నుంచి నిరసన కార్యక్రమాలను తలపెట్టినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యచందర్, నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా వెంకటేష్ తెలిపారు. గురువారం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్‌రెడ్డిని, ఓఎస్డీ ప్రొ. జితేందర్ నాయక్‌లను కలిసి వారి సమస్యలు, ప్రధాన డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను దీర్ఘకాలంగా ఓయూ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం కానీ పరిష్కరించడం లేదన్నారు. దాదాపు 30ఏళ్ల నుంచి చాలీ చాలనీ వేతనాలతో ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నామన్నారు. 23 నుంచి 29 వరకు శాంతియుత నిరసన ర్యాలీ, మానవహారం, మహాధర్నా, రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి


పోలింగ్ కేంద్రాల సందర్శించిన అఖిలపక్షం నాయకులు

సికింద్రాబాద్: నియోజకవర్గంలో అదనంగా ఏర్పాటు చేయాల్సిన 40 పోలింగ్ కేంద్రాలకు కొత్త భవనాలు ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు కోరారు. గురువారం సికింద్రాబాద్ ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులును కలిసిన వారు వినతి పత్రం అందించారు. ఒకే భవనంలో ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ఫలితంగా ఓటర్లకు మౌలిక వసతులు కరువవుతాయని చెప్పారు. నియోజకవర్గం అంతటా పర్యటించిన వివిధ పార్టీల నాయకులు అక్కడి లోటుపాట్లను నివేదిక రూపొందించి, ప్రత్యామ్నాయ భవనాలను సూచించారు. వినతిపత్రం స్వీకరించిన ఎన్నికల అధికారి ఆంజనేయులు తమ నివేదిక అమలు చేసేందుకు సానుకూలంగా స్పందించినట్లు అఖిలపక్షం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రాజసుందర్ (బీఆర్‌ఎస్), జలంధర్‌రెడ్డి, ప్రవీణ్‌లాల్ (కాంగ్రెస్), బి.నర్సింగరావు (బీఎస్పీ), ప్రకాశ్‌గౌడ్ (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో ఎక్కడి పూడిక అక్కడే..?


ముంపు ప్రాతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా నాలాల్లో మాత్రం ఎక్కడి పూడిక అక్కడే ఉంటుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మినిస్టర్ రోడ్‌లో భారీ వర్షంతో ముంపుకు గురైన కాచి బౌలి, జూలమ్మ టెంపుల్, నల్లగుట్ట ప్రాంతాల్లో గురువారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. నాలాల్లో ఎక్కడ చూసినా పూడిక తొలగించిన ఆనవాళ్లు కనిపించడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని మండిపడ్డారు. మున్సిపల్ శాఖ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దనే ఉన్నందున నాలాల్లో పూడిక తొలగింపు విషయంలో పూర్తిస్థాయి సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ మహేశ్, శానిటేషన్ డీఈ వెంకటేష్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, మహేశ్‌యాదవ్, మహేందర్, అరుణ్ భట్, గణేశ్, చంద్రప్రకాష్ తదితరులు ఉన్నారు.

క్రీడలు ఐక్యతకు స్ఫూర్తి

క్రీడలు ఐక్యతకు స్ఫూర్తిగా నిలుస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఆలిండియా జ్యూవెలరీ హ్యాండ్ మేడ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఫుట్‌బాల్, క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్ నాయకులు చంద్రప్రకాష్, అబుల్, సమీర్, తాహీర్, మైదుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి ప్రభుత్వానిదే బాధ్యత

అమీర్‌పేట: ప్రభుత్వం మృతుడు మొహ్మద్ షరీఫుద్దీన్ కుటుంబాన్ని ఆదుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. బల్కంపేట అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి కింద నీట మునిగి వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి కింద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయక పోవడం ప్రమాదానికి ఒక కారణమని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే లైట్లు ఏర్పాటు చేయడమే కాకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత వహించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి ఆర్థికసాయం మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ ఎస్.శేషకుమారి, కొలను బాల్‌రెడ్డి, హనుమంత్‌రావు, జీహెచ్‌ఎంసీ అధికారులు జయంత్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంటకమరణ, మన్సూర్, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మండల కార్యాలయంలో సిబ్బంది కొరత

ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తు దారులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో మంజూరు కావాల్సిన దరఖాస్తులు కూడా ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇటీవల మారేడుపల్లి మండల కార్యాలయం నుంచి ముగ్గురు రికార్డ్ అసిస్టెంట్‌లు బదిలీపై వెళ్లారు. ఇది వరకు వీరు ఇన్‌వార్డు, కంప్యూటర్ రూమ్‌ల్లో విధులు నిర్వహించే వారు. ప్రస్తుతం వీరి బదిలీలతో మారేడుపల్లి మండల కార్యాలయంలో మ్యాన్ పవర్ తగ్గింది. దీంతో సర్టిఫికెట్ల వేరిఫికేషన్, మంజూరు చేసే ఆర్‌ఐలు మండల కార్యాలయంలోని ఇన్‌వార్డు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో సిబ్బంది లేకపోవడంతో ఆటు మండల కార్యాలయం సిబ్బందితో పాటు దరఖాస్తుదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

అడుగు లోతు గుంతలు

ఆదమరిస్తే అంతే సంగతులు




కంటోన్మెంట్: తాజా వర్షాలకు మోండా డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్– టీచర్స్ కాలనీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం డ్రైనేజీ మురుగు ప్రవహిస్తూ ఉంటుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దిగజారింది. అడుగు లోతులో పెద్ద పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడు వరద ప్రవాహం, మురుగు కలిసి ప్రవహిస్తూ ఉండటంతో గుంతలను గమనించే అవకాశం కూడా ఉండదు. దీంతో నిత్యం పదుల సంఖ్యలో దిచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూలు పిల్లలను తీసుకెళ్లే ఆటోలు ఈ గుంతలపై నుంచి వెళ్తున్న క్రమంలో గాయాలపాలవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.